క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నేడు

నెల్లిమర్ల: విద్యుత్ శాఖ విజయనగరం సబ్ డివిజన్ నెల్లిమర్ల కార్యాలయంలో వినియోగదారుల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్స్యూమర్ గ్రీవెన్సెస్ ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు సమస్యలుతెలియజేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

డెంకాడ: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

సర్వజన ఆస్పత్రి వద్ద ర్యాలీ నేడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా జనరల్ మెడిసిన్, ఎన్‌సీడీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించనున్న ఎన్‌సీడీ వైద్యాధికారి మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం హెల్త్‌కేర్ వర్కర్స్‌కు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి'



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూత నివ్వడంలోనే సంతృప్తి ఉందని వ్యాపారవేత్త ఆడారి వెంకటేశ్వరావు అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, గోధమనూక, నూనె, తదితర నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమకు తోచిన సహాయాన్ని పేదలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, కనపాక నాగరాజు, విరిని తులసీరామ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి నిరవధిక నిరాహార దీక్ష



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17 నుంచి కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు డి. రాజు, ఎం.సౌమ్య, రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన నందెన్న

దత్తిరాజేరు: మండలంలోని పలుగ్రామాల్లో నందెన్న ఉత్సవాల సందడి నెలకొంది. ఏటా దీపావళి రోజు సాయంత్రం శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్టించి, నాగుల చవితిరోజు వరకు పూజలు చేసి నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కోమటిపల్లి, పెదమానాపురం, గడసాం తదిత ర గ్రామాల్లో ప్రజలు మండపాలు ఏర్పాటు చేసి ఆదివారం రాత్రి శివపార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠి పూజలు చేశారు.

నేడు కనిమెరకలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

బొండపల్లి: కనిమెరక గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్'(ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు సోమవా రం తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నామని, మండల ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల నాయకులు హాజరు కావాలని కోరారు.

19న యోగా శిబిరం, గాయత్రీ మహాయజ్ఞం

చీపురుపల్లి: స్థానిక కొత్తఅగ్రహారంలోని ఆర్య సమాజం ఆవరణలో ఈనెల 19న యోగా శిబిరం, గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు ఆర్యసమాజం ప్రతినిధి కుమరావు అప్పలనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపా రు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా నేర్పించనున్నామని, ఉదయం 9 గంటలకు గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రామదేవ్ బాబా శిష్యురాలు నీలం నిర్మలతో పాటు హరిద్వార్, ఒడిసా, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.

విరజిమ్మిన వెలుగులు



డెంకాడ: పినతాడివాడ దీపావళి టపాసులు కాలుస్తున్న మహిళలు, చిన్నారులు

● వాడవాడలా సందడిగా 'దీపావళి'

డెంకాడ: వాడవాడలా దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం ఇళ్ల ముందు దీపాలు వెలిగించి, సంప్రదాయబద్ధంగా పండుగ చేసుకున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. దీంతో గ్రామాలన్నీ దీపాలు, బాణసంచా వెలుగులతో కళకళలాడాయి.

అంధుల పాఠశాలలో దీపావళి వేడుకలు

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ద్వారకామయి అంధుల పాఠశాలలో దీపావళి వేడుకలను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అంధ విద్యార్థులతో కలిసి టపాసులు కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులకు సరదా కల్పించాలనే ఉద్దేశంతోనే ద్వారకామయి పాఠశాలలో దీపావళి వేడుకలు జరుపుకున్నట్లు చెప్పారు.

పాఠశాల నిర్వాహకురాలు ఆశాజ్యోతి మాట్లాడుతూ, అందరి జీవితాలలో దీపావళి ఒక ప్రత్యేక రోజుగా పరిగణిస్తామన్నారు. అలాంటి రోజున డిప్యూటీ మేయర్ శ్రావణి తమ పాఠశాల పిల్లలతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బండారు ఆనందరావు, పాఠశాల శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



వెలుగులు విరజిమ్ముతున్న చిచ్చుబుడ్డు



ఆకాశదీపం

● పట్టణంలో దీపావళి సందడి

విజయనగరం జిల్లా కేంద్రంలో దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. దీంతో విజయనగరంలో వెలుగులు విరబూసాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఓ ఇంటి ముందు భూచక్రం వెలుగులు



ఆకాశంలో బాణసంచా వెలుగులు



రాకెట్ తారాజువ్వ కాంతి..

గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయండి



వారోత్సవాల కరపత్రాలను అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సేవా సంఘ ప్రధాన కార్యదర్శి దయానంద్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, యువ త విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సేవా సంఘ ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ కోరారు. వారోత్సవాల కార్యక్రమాల ప్రచార పత్రాలను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజు ల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, గ్రంథాలయాల పట్ల అవగాహన, ఆసక్తిని పెంచేందు కు వారోత్సవాలు ఎంతగానో దోహ దపడతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ వారోత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పైడిరాజు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స కోలుకోవాలని పూజలు

గజపతినగరం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఇటీవల హైదరాబాద్‌లో గుండె శస్త్రచికిత్స జరిగింది. ఆయన త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి చేరు కోవాలని ఆకాంక్షి స్తూ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు గజపతినగరంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 101 కొబ్బరి కాయలు కొట్టారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గారతవుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, కాలంరాజు పేట సర్పంచ్ జి.ఈశ్వరరావు, పురిటిపెంట, గజపతినగరం వైస్ సర్పంచ్‌లు మండల సురేష్, కర్రి రాము నాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, సీనియర్ నాయకులు కర్రి నానాజీ, గేదెల జగదీశ్వరరావు, ఇనుమల రాజు, శీర రమణ, జెర్రి పోతుల జగదీష్, ఆదాడ గోపి, బి.వాసు, ఎం.లక్ష్మునాయుడు, స్వామి,శ్రీను పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యతపై మ్యాజిక్ షో నిర్వహిస్తున్న కళాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో ఏపీజీవీబీ ఆధర్యంలో ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, అనవసరమైన సందేశాలకు ఖాతాదారులు స్పందించవద్దని హితవు పలికారు. ఫోన్ల ద్వారా ఏ బ్యాంక్ కూడా ఖాతాదారుల నుంచి ఎటువంటి సమాచారం కోరదని స్పష్టం చేశారు. అలాగే పీఎం సురక్ష ప్రయోజనాలు వివరించి పథకంలో చేరాలని కోరారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించి మ్యాజిక్ షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బ్యాంక్‌మిత్ర నడిపేన శిరీష, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం



అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో దీక్షలు ఆచరిస్తున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. అయ్యప్ప, భవానీ, శివ దీక్షాదారులకు 41 రోజుల పాటు చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 12 ఏళ్లుగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో దీక్షాదారులకు 41 రోజుల పాటు అన్నదానం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ మధ్యనే కోటీ యాభై లక్షల రూపాయలతో నిర్మించిన నిత్యాన్నదాన భవనాన్ని ప్రారంభమైందని చెప్పారు. కార్యక్రమంలో కామరాజు, కంది మురళీనాయుడు, ఆడారి నగేష్, మారం బాల బ్రహ్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ప్రజారక్షణభేరిని జయప్రదం చేయండి



వేపాడ: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ

శృంగవరపుకోట/ జామి/ వేపాడ: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణభేరిని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. ఎస్.కోట పట్టణంలో, జామి మండలంలో జామి, విజినిగిరి, తదితర గ్రామాల్లో, వేపాడ మండలంలోని సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, ఆకులసీతంపేట, వల్లంపూడి, వేపాడ, ఎం.శింగవరం, బానాది, బల్లంకి తదితర గ్రామా ల్లో సోమవారం ఆటోజాత నిర్వహించారు. ఈసందర్భంగా తమ్మినేని తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో నిరుద్యోగం తీవ్రమైందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విస్మరించి, కార్పొరేట్ సంస్థల కోసం పని చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం తీరుకు నిరసనగా చేపట్టిన ప్రజారక్షణభేరికి రైతులు, కార్మికులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, గాడి అప్పారావు, సీహెచ్.ముత్యాలు, హర్ష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ వర్క్‌షాపులో 'సీతం' అధ్యాపకులు



ప్రశంసాపత్రాలతో సీతం అధ్యాపక బృందం

విజయనగరం అర్బన్: ఐఐటీ ముంబై, ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కేరళ) ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా 'ఇంట్రడక్షన్ టు రోబోటిక్స్' అనే అంశంపై ఈ నెల 9, 10, 11 తేదీల్లో కొచ్చిలో నిర్వహించిన ఇ-యంత్ర ఫ్యాకల్టీ వర్క్‌షాప్‌లో పట్టణానికి చెందిన సీతం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ త్రూ ఐసీటీ ప్రోగ్రామ్ కింద ఐఐటీ ముంబై రూపొందించిన ఈ వర్క్‌షాప్‌ను ఫ్యాకల్టీ కోసం 'ట్రైనింగ్ ఆన్ రోబోటిక్ ఎంబెడెడ్ సిస్టమ్స్' లక్ష్యంగా నిర్వహించారని వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఇటువంటి వర్క్‌షాపులు ఉపయోగపడతాయని చెప్పారు. వర్క్‌షాపులో పాల్గొన్న నలుగురు అధ్యాపకులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారని తెలిపారు. వర్క్‌షాపులో పాల్గొన్న అధ్యాపకులను కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీ నాయుడుతో పాటు కె.హరికృష్ణ (ఈసీఈ), జి.శ్రీధర్ (సీఎస్ఈ), డి.చైతన్య (మెకానికల్) ఉన్నారు.

ఆహారం, నిత్యావసర సరుకుల పంపిణీ



విద్యార్థులకు ఆహారం పంపిణీ చేస్తున్న మహిళా కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: జయశాలి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రేమ వెలుగు సేవా ఆశ్రమంలో నిరుపేద చిన్నారులకు ఆహారం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బి. అనితాదేవి మాట్లాడుతూ, నిరుపేదలకు సాయమందించడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. తమ సంస్థ తరఫున సేవలందించేందుకు మహిళా కమిటీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి జి.మౌనికమాధురి, పి.మేరీ ఇమాన్యుయేల్, కె.రూతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సీఎం కావాలంటూ పాదయాత్ర



గురునాథ్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చే 2024 ఎన్నికల్లో కూడా మళ్లీ సీఎం కావాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన గురునాథ్ తిరుపతి వరకు పాదయాత్ర చేపడుతున్నారు. పాదయాత్రలో భాగంగా ఆదివారం భోగాపురం చేరుకున్న గురునాథ్ యాదవ్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి బొకేలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప్పాడ మాట్లాడుతూ, పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, పట్నా తాతయ్యలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘీభావం

విజయనగరం టౌన్: వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో అఖండ విజయంతో గెలుపొంది మరలా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ టెక్కలి నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేస్తున్న జి.గురునాథ్ యాదవ్‌కు జిల్లా యాదవ సంఘ నాయకులు పడగల బంగార్రాజు యాదవ్, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ మేరకు విజయనగరం సరిహద్దు మోదవలసకు చేరుకున్న పాదయాత్రలో అతన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, పడగల సురేష్, కర్రి రా ము, పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

దత్తిరాజేరు: కోమటిపల్లి న్యూటన్ యూపీ స్కూల్ విద్యార్థులు ఇద్దరు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. న్యూటన్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు సోమవారం మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన మీసాల రాజారత్నంనాయుడు, నక్కల్ల లోకేష్‌కు ఎస్.కోట మండలంలోని కిల్తంపాలెం వద్ద ఉన్న జవహర్ నవోదయ పాఠశాలలో ఆరోతరగతిలో సీట్లు వచ్చాయని చెప్పారు. రాజరత్నంనాయుడు ప్రస్తుతం షికారుగంజి మోడల్ స్కూల్‌లో, లోకేష్ మరుపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నారు.

ఇంటింటికీ సంక్షేమం



మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రం లక్కవరపుకోటలో సోమవారం 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ప్రతీ కుటుంబానికి వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కొన్ని సమస్యలను అక్కడిక క్కడే పరిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడప గడపకూ వస్తున్నామని చెప్పారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నాటికి 284 రోజులు పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఇప్పటికే 80 శాతానికి పైగా పరి ష్కరించామన్నారు. ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.20 లక్షల తో పాటు వేర్వేరు పథకాల ద్వారా గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వారి ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను అర్హతే ప్రామాణికంగా మంజూరు చేస్తున్నామని, పథకా ల కోసం ఎవరి సిఫార్సులూ అవసరం లేదని, ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం జన్మభూమి కమిటీ సభ్యులకు లంచాలు ఇచ్చే వారికే మంజూరు చేసే వారని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ.. సుపరి పాలన అందిస్తున్న సీఎం జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారావు, జామి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, నాయకులు పినిశెట్టి కిష్టప్పదొర, జె.డి.కె.అప్పలరాజు, డేగల సాయిలక్ష్మి, ఆవాల సత్యనారాయణ, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవి శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. దేవస్థానం కమిటీ వైస్ చైర్మన్ సూరు కుమార్, జిల్లా టెలీకాం బోర్డు సభ్యుడు తిరుమల పాల్గొన్నారు.